# శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్
# గౌరవనీయ ఆర్థిక శాఖామాత్యుల వారి ప్రసంగం
# మార్చి 16, 2023

**గౌరవనీయ అధ్యక్షా!**

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను మీ అనుమతితో గౌరవ సభ ముందు ప్రతిపాదిస్తున్నాను.

**దాదాపు ఒక శతాబ్దం క్రితం, శ్రీ గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ గారు ఇలా వ్రాశారు.**

***'నిరంతరం కార్యదీక్షత మరియు విశాల దృక్పథంతో***
***మదిని మార్గదర్శనం చేసేలా***
***ఆ స్వేచ్ఛా స్వర్గంలోకి చేరేలా***
***నా దేశాన్ని జాగృతం చేయండి తండ్రీ'***

2. ఈ సందేశం ఒక కార్యాచరణ కోసం పిలిచే శక్తివంతమయిన పిలుపు. ఈ సందేశాన్ని మనం అనుసరించగలిగితే మార్పు తీసుకురాగలం అనే నమ్మకం దృఢపడుతుంది. నాటి భావోద్వేగాలు నేటికీ మన హృదయాలలో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఎందుకంటే మెరుగైన ప్రపంచం కోసం తపించడం అనేది మానవుని సహజ స్వభావం. **'నా దేశాన్ని జాగృతం చేయండి'** అనే చివరి మాటలను **'ప్రపంచాన్ని జాగృతం చేయండి'** అనే మాటలతో భర్తీ చేస్తే సార్వజనీయత గోచరిస్తుంది. ఈ భావన స్ఫూర్తినిచ్చే ఒక అమూల్యమైన సందేశం. ఈ ప్రేరణ అన్ని అసమానతలను అధిగమించగల స్ఫూర్తిని, అపూర్వమైన సవాళ్లపై విజయం సాధించగలమనే సంకల్పాన్ని మెరుగుపరుస్తుంది.

3. ప్రపంచ వ్యాప్తంగా క్లిష్టమయిన సంక్షోభాలను సమర్ధవంతంగా ఎదుర్కొని, సమిష్టి కృషితో మరింత బలంగా ఉద్భవించిన ప్రభుత్వాల గురించి చరిత్ర మనకు చెబుతుంది. మన రాష్ట్రం ఇందుకు ఒక మహోజ్వల ఉదాహరణగా నిలిచింది. రాష్ట్ర విభజన తరువాత మనము

అన్ని రంగాలను 2014 నుండి పునఃప్రారంభించ వలసిన పరిస్థితి ఏర్పడింది. విభజన సవాళ్లతో సతమతమవుతూ కోవిడ్-19 మహమ్మారితో సాహసోపేతమైన పోరాటం చేయవలసి వచ్చింది. అయితే ఒక ప్రక్క ప్రపంచ స్థాయి ఆరోగ్య సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ మన రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి, జీవనానికి రక్షణ వలయాన్ని నిర్మించుకుంటూ, మరొక ప్రక్క రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానాన్ని కొనసాగించాము. ఈ సంక్షోభ సమయంలో కూడా ఆరోగ్య సంరక్షణ నుండి సుస్థిరాభివృద్ధి వరకు అన్ని రంగాలలోని ప్రతికూలతలను అధిగమించాం. తద్వారా ఈ సంక్షోభాన్ని కూడా ప్రజల జీవితాలలో సానుకూల మార్పులు తీసుకొచ్చి యథాస్థితికి చేరుకునే ఒక అవకాశంగా మా ప్రభుత్వం మార్చుకుంది.

4. కోవిడ్ మహమ్మారి తదనంతరం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రాముఖ్యత పొందిన అంశాలు రెండు. అవి **సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు** మరియు **సుపరిపాలన.** ఇవి రెండూ పరస్పర సంబంధం మరియు సార్వత్రిక ఆకాంక్షలు.

5. 'సుస్థిరత' జీవితానికి మార్గదర్శక సూత్రంగా, 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (S.D.G. లు) సాధనకు బలమైన రాజకీయ నాయకత్వం, మంచి విధానాలు, సమర్థవంతమైన సంస్థలు మరియు ఫలితాల ఆధారిత పాలనపై ఆధారపడి ఉంటుందని మేము దృఢంగా విశ్వసిస్తున్నాము. 'సుస్థిర అభివృద్ధి' జవాబుదారీతనం, ప్రతిస్పందన, పారదర్శకత మరియు సమాన అవకాశాలతో కూడిన సుపరిపాలనకు దారితీస్తుంది. అదేవిధంగా స్థిరమైన అభివృద్ధి సాధించడానికి సుపరిపాలన అవసరం. ఈ లక్ష్యాల నిజమైన అమలుకు బలమైన సంస్థలే పునాది రాళ్ళు. మా ప్రభుత్వం ఈ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేస్తోంది.

6. దూరదృష్టి గల నాయకత్వం, సమర్థ పరిపాలన మరియు ఖచ్చితమైన నిర్వహణతో కూడిన గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలో ఈ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు కీలకమైనవి. ఈ సందర్భంలో ఆంగ్ల రచయిత మరియు కవి **రుద్యార్డ్ కిప్లింగ్** రాసిన ప్రసిద్ధ కవిత **'If–'** నుండి రెండు పంక్తులను గుర్తుచేస్తున్నాను.

*“మీరు ‘విజయం’ మరియు ‘విపత్తు’లు కలిగిన సందార్భాలను ఒకేలా చూడగలిగితే*
*జన సమూహం మధ్య మాట్లాడుతున్నప్పుడు కూడా మీ ఔన్నత్యం చెక్కుచెదరదు.*
*మీరు రాజుల మధ్య నడిచేటప్పుడు కూడా సామాన్యుడి చేతిని విడువరు*
*మీరు ప్రతిఒక్కరి హృదయాలలో ఎప్పటికి నిలిచి ఉంటారు’*

***–రుడ్యార్డ్ కిప్లింగ్***

7. ఈ వాక్యాలు గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారి నిజమైన వ్యక్తిత్వాన్ని సూచిస్తున్నాయి. ఆయన పాలనలో **‘కష్టాలు రాకుండా ఎల్లవేళలా నిరోధించలేనప్పటికీ, ఆ కష్టాలను మంచి మార్గాల ద్వారా ఎదుర్కోవచ్చనే భరోసాను’** మనము చూస్తున్నాము. మరో మాటలో చెప్పాలంటే విజయాన్ని పొందినపుడు ఉదారంగా ఉండడం, కష్టాలను ఎదుర్కొనే ప్రతికూల సమయాలలో దృఢంగా ఉండటం ఆయన లక్షణాలు.

8. విధానపరమైన ఆవిష్కరణలు మరియు వినూత్న పాలనా విధానాలు మా ప్రభుత్వం యొక్క విశిష్ట లక్షణాలు. 2030 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం నవరత్నాలు మరియు మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలు ఆధారంగా రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఒక సమ్మిళిత విధానాన్ని మా ప్రభుత్వం అవలంభించింది.

9. మా మ్యానిఫెస్టో యొక్క ముఖ్య లక్షణాలు **సుస్థిర అభివృద్ధి మరియు సుపరిపాలన** అనే సూత్రాల సమ్మేళనం. మా ప్రభుత్వం, పాలనలో మొదటి సంవత్సరమే ఈ సూత్రాలన్నింటినీ దాదాపుగా అమలు చేసింది. కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఈ సూత్రాలు అమలులో ఎన్నో అవాంతరాలు ఏర్పడినప్పటికీ, వెనుకంజ వేయకుండా వీటన్నింటినీ సంపూర్ణంగా అమలు చేస్తున్నాము. నిజానికి, మా మేనిఫెస్టోలోని వాగ్ధానాలకు మించి మా ప్రభుత్వం పనిచేస్తోంది.

10. వినూత్నమైన పాలనా విధానాల ఫలితంగా నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వ్యవధిలో 15,004 గ్రామ మరియు వార్డు సచివాలయాల ఏర్పాటు; 1.34 లక్షల ఉద్యోగుల నియామకం; 2.65 లక్షల మంది వాలంటీర్ల నియామకం; 51,488 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏ.పి.ఎస్.ఆర్.టి.సి.) ఉద్యోగులను ప్రభుత్వ పరిధిలోనికి

తీసుకురావడం; 15,715 పాఠశాలలలోని మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, 3,707 వై.ఎస్.ఆర్. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మరియు 461 వై.ఎస్.ఆర్. పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని పూర్తి చేయడం; 30.65 లక్షల ఇంటి స్థలాల పట్టాల పంపిణీ; 4.4 లక్షల ఇళ్ల నిర్మాణం; జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా 44.49 లక్షల తల్లులకు ఆర్థిక సహాయాన్ని అందించడం; 5.2 లక్షల ఇ–లెర్నింగ్ పరికరాల (ట్యాబ్‌ల) పంపిణీ; సి.బి.ఎస్.ఇ. అనుబంధంతో ఇంగ్లీషు మీడియం విద్య, జగనన్న విద్యా దీవెన పథకం క్రింద 9,249 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్సుమెంట్; వై.ఎస్.ఆర్. ఆసరా పథకం క్రింద స్వయం సహాయక సంఘాలకు ఋణాల రీయింబర్సుమెంట్ నిమిత్తం 19,133 కోట్ల రూపాయలు జమ చేయడం; వై.ఎస్.ఆర్. చేయూత పథకం క్రింద 14,129 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం; జగనన్నతోడు పథకం క్రింద 2,470 కోట్ల రూపాయల ఋణాల మంజూరు; వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ పథకం క్రింద 1.41 కోట్ల కుటుంబాలకు వర్తింపు; వై.ఎస్.ఆర్. ఆరోగ్య ఆసరా పథకం క్రింద 971 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని కల్పించడం; 56 సామాజిక సంక్షేమ కార్పోరేషన్ల ఏర్పాటు; 10,778 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, 104–అంబులెన్స్‌ల సంఖ్యను పెంచడం; సంక్షేమ పింఛన్‌లను నెలకు 2,750 రూపాయలు ఇవ్వడం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టగలిగాము.

11. ఇవే కాకుండా సంక్షేమ కార్యక్రమాల యొక్క అమలు యంత్రాంగంలో సమూల మార్పులను గమనించవచ్చు. సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా, ప్రభుత్వం నేరుగా 21 రకాల వివిధ పథకాల క్రింద రాష్ట్రంలోని అర్హులైన లబ్దిదారులందరి బ్యాంకు ఖాతాలలోకి నగదును జమ చేస్తుంది. ప్రత్యక్ష నగదు బదలీ పథకంను అమలుచేసేందుకు మా ప్రభుత్వం 1.97 లక్షల కోట్ల రూపాయలను ఇంత వరకు విడుదల చేసింది. మా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ ప్రత్యక్ష నగదు బదిలీ విధానము సంక్షేమ కార్యక్రమాల యొక్క అమలులో ఒక అద్భుతమైన నమూనాగా నిలిచింది. ఈ విధానం సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను పూర్తిగా నివారించి అర్హులైన వారందరికీ ఎటువంటి అవాంతరాలు లేకుండా, పారదర్శకంగా మరియు ప్రభావవంతమైన పద్ధతిలో సంక్షేమ చర్యలు అందేలా పని చేస్తుంది.

## రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి

12. 2018-19 ఆర్థిక సంవత్సరంలో, రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధికి సంబంధించి స్థిరమైన ధరలలో మన రాష్ట్రం దేశంలో 22వ స్థానంలో ఉంది. మా ప్రభుత్వం యొక్క అభివృద్ధి విధానాల కారణంగా, పెట్టుబడి మరియు వినియోగం రెండింటినీ అనుసంధానిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎంతో పురోభివృధిని పొందింది. ఫలితంగా, మన రాష్ట్రం 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను స్థిరమైన ధరలతో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (GSDP) వృద్ధి పరంగా దేశంలో 1వ స్థానంలో ఉంటూ గుర్తించదగిన వృద్ధి రేటు 11.43 శాతంగా నమోదు చేసింది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో మన ప్రభుత్వం అందించిన మద్దతు రాష్ట్ర ఆర్థిక సుస్థిరాభివృద్ధి సాధించడంలో ప్రభావవంతంగా పనిచేసిందని, గత ఐదేళ్ళలో అత్యధిక వృద్ధిరేటును నమోదు చేయడానికి వీలుకల్పించిందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అత్యంత క్లిష్ట పరిస్థితులలో సైతం మా ప్రభుత్వం తన లక్ష్యాలను నెరవేర్చడమే కాకుండా, ఆర్థిక స్థిరత్వం మరియు వృద్ధి అవకాశాలకు కూడా ప్రాధాన్యతనిచ్చి పరిరక్షించిందని ఈ గణాంకాలు చూపుతున్నాయి.

13. 2022-23 ఆర్థిక సంవత్సరములో సవరించిన అంచనాల ప్రకారము రాష్ట్ర స్థూల ఉత్పత్తి 13,17,728 కోట్ల రూపాయలు. 2023-24 ఆర్థిక సంవత్సరములో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 14,49,501 కోట్ల రూపాయలతో 10 శాతము వృద్ధిగా అంచనా వేయబడినది.

14. నవరత్నాలు మరియు మ్యానిఫెస్టోలో చెప్పిన అన్ని పథకాలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో ఏకీభవిస్తున్నాయి. ఇవి (ఎ) జీవనోపాధి, (బి) సామర్థ్య అభివృద్ధి మరియు సాధికారత, (సి) సామాజిక భద్రత మరియు (డి) మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక అభివృద్ధి అనే నాలుగు అంశాల ద్వారా వివరించబడ్డాయి.

15. నేను ఈ నాలుగు అంశాల ద్వారా అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుసంధానం చేస్తూ 2023-24 ఆర్థిక సంవత్సరంనకు బడ్జెట్ కేటాయింపులను ప్రతిపాదిస్తున్నాను.

## ఎ. జీవనోపాధి

16. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో సుమారు 62 శాతం మంది ప్రజలు ఆధారపడి ఉన్నందున ఈ రంగాన్ని మన ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైనదిగా చెప్పుకోవచ్చు. అందువలననే, **వై.ఎస్.ఆర్. రైతు భరోసా-పి.ఎమ్. - కిసాన్, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా-ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, డాక్టర్ వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ పంట రుణాలు, డాక్టర్ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వై.ఎస్.ఆర్. వ్యవసాయ ఉత్పత్తుల పరీక్షా కేంద్రాలు, డాక్టర్ వై.ఎస్.ఆర్. పొలం బడి వ్యవసాయ ఉత్పాదనకు ఉపయోగపడే వస్తువుల మరియు పరికరాలపై రాయితీలు మరియు వ్యవసాయ యాంత్రీకరణ** వంటి కార్యక్రమాల ద్వారా ఈ రంగంలో ఉత్పాదకత మరియు ఆదాయాలను పెంపొందించడంపై మా ప్రభుత్వం తిరుగులేని దృష్టి పెట్టింది.

**డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా-పి.ఎమ్. కిసాన్**

***'భూమిని సాగు చేసేవారు అత్యంత ముఖ్యమైన పౌరులు.***
***వీరు అత్యంత శక్తి మంతులు, అత్యంత స్వతంత్రులు మరియు అత్యంత ధర్మబద్ధులు'***

***- థామస్ జెఫెర్సన్***

***అన్నదాతకు మట్టికి ఉన్న అనుబంధానికి శిరస్సు వంచి అభివాదం తెలిపే ప్రభుత్వం ఇది.***
***నేలను నమ్ముకున్న రైతుల వృత్తి ధర్మాన్ని శ్రమ వేదంగా భావించే ప్రభుత్వం ఇది.***
***రైతు లేనిదే రాజ్యం లేదని గుండెల నిండా విశ్వసించే ప్రభుత్వం ఇది.***

17. మే నెలలో వ్యవసాయ ఉత్పాదనకు ఉపయోగపడే వస్తువులు మరియు పరికరాలు కొనుగోలు చేయడానికి, అక్టోబర్ నెలలో వారి పంటలను పండించుకోవడానికి మరియు జనవరి నెలలో ఇతర వ్యవసాయ కార్యకలాపాలను చేపట్టడానికి **వై.ఎస్.ఆర్. రైతు భరోసా-పి.ఎమ్.కిసాన్ పథకం** నిధులతో కలిపి మూడు విడతలలో 13,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని రైతులకు సకాలంలో మా ప్రభుత్వం అందజేస్తోంది. వాస్తవ సాగుదారులకు ప్రయోజనం చేకూర్చేందుకుగాను, కౌలుదారులకు మరియు అటవీ హక్కుల క్రింద గుర్తించబడిన

భూమిని సేద్యం చేస్తున్న (ఆర్.ఓ.ఎఫ్.ఆర్.) గిరిజన రైతు కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి ఆర్థిక సహాయంగా 13,500 రూపాయలు రాష్ట్ర బడ్జెట్ నుండే పూర్తిగా అందించబడుతున్నాయి. ఈ పథకం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు ప్రత్యక్ష నగదు బదలీ విధానం ద్వారా 27,063 కోట్ల రూపాయలను అర్హులైన రైతు కుటుంబాల ఖాతాలలో జమ చేయడం జరిగింది. ఈ పథకం క్రింద 52.38 లక్షల మంది రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి 4,020 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

***'ప్రతీ వస్తువును రిటైల్‌గా కొనుగోలు చేసి తాను పండించిన దాన్ని హోల్‌సేల్‌గా అమ్మేవాడే రైతు' అంటాడు జాన్.ఎఫ్. కెన్నడీ. ఇప్పటికీ ఇది చేదు వాస్తవం.***

18. రైతులకు ముందుగా పరీక్షించిన వ్యవసాయ ఉత్పాదనకు ఉపయోగపడే నాణ్యమైన వస్తువులు మరియు పరికరాల సరఫరా మొదలుకొని గ్రామస్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ వరకు **డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలు** సేవలందిస్తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 12 లక్షల మంది రైతులకు 187 కోట్ల రూపాయల విలువైన సుమారు 7 లక్షల క్వింటాళ్ల నాణ్యత ధృవీకరించబడిన మరియు సబ్సిడీతో కూడిన పంట విత్తనాలు మా ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయబడ్డాయి. ఐక్యరాజ్యసమితికి అనుబంధ సంస్థ అయిన ఆహార మరియు వ్యవసాయ సంస్థ (F.A.O.), నీతి ఆయోగ్ మరియు భారత రిజర్వు బ్యాంకు - ఈ మూడు సంస్థలు మన రైతు భరోసా కేంద్రాల పనితనాన్ని ఎంతో ప్రశంసించి వాటి అవసరాన్ని గుర్తించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను మిగిలిన 7,578 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి 40.46 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

19. వ్యవసాయ ఉత్పాదనకు ఉపయోగపడే వస్తువుల మరియు పరికరాల నాణ్యతా పరీక్షల కోసం 72 **వై.ఎస్.ఆర్. వ్యవసాయ ఉత్పత్తుల పరీక్షా కేంద్రాలను** మా ప్రభుత్వం జూలై 8, 2021 న ప్రారంభించింది. ఈ పరీక్షా కేంద్రాలు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను మరియు భూసార పరీక్ష ఫలితాలను రైతులకు సకాలంలో అందజేస్తూ ఉండంవలన వారు తమతమ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొని వ్యవసాయ ఉత్పాదకతను

పెంచడంవలన  మన రాష్ట్రం దేశంలోనే మొదటి రాష్ట్రంగా ఉంది. నియోజకవర్గ స్థాయిలో మిగిలిన 75 వ్యవసాయ ఉత్పత్తుల పరీక్షా కేంద్రాలు మరియు జిల్లా స్థాయిలో మరో 11 పరీక్షా కేంద్రాలు 2023 ఖరీఫ్ కాలం నుండి పనిచేస్తాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను డాక్టర్ వై.ఎస్.ఆర్. వ్యవసాయ ఉత్పత్తుల పరీక్షా కేంద్రాల కోసం 36.39 కోట్ల రూపాయల కేటాయింపును  ప్రతిపాదిస్తున్నాను.

20. వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడం మా ప్రభుత్వం చేపట్టే పథకాలలో ముఖ్యమైన లక్ష్యం. **డాక్టర్ వై.ఎస్.ఆర్. పొలం బడి కార్యక్రమం** ద్వారా పర్యావరణ అనుకూల సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, సాగు ఖర్చు తగ్గిస్తూ, పంట దిగుబడులను పెంచడం కోసం మా ప్రభుత్వం సమగ్ర పంట నిర్వహణ పద్ధతులతో రైతులకు సాధికారత కల్పిస్తోంది. దీని కోసం 2021-22 ఆర్థిక సం॥లో 16,123 పొలం బడి కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. వివిధ పంటల విషయంలో సాగు ఖర్చు 21 శాతం తగ్గి మరియు దిగుబడి 23 శాతానికి పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 17,000 పొలం బడి కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయబడుతున్నాయి.

21. ఇ-క్రాప్ మరియు ఇ-కె.వై.సి. తర్వాత గుర్తించబడిన ప్రాంతాలలో, గుర్తించబడిన పంటలు పండించే రైతులందరికీ స్వయంచాలకంగా అమలు అయ్యేలా **2019 ఖరీఫ్ కాలం** నుండి మా ప్రభుత్వం **డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా పథకాన్ని** ప్రవేశపెట్టింది. పారదర్శకంగా, విశిష్టంగా మరియు సమర్థవంతంగా అందరికీ వర్తింపు హామీనిస్తూ ఉచిత పంటల బీమాను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో మన రాష్ట్రం మాత్రమే కావడం గర్వించదగ్గ విషయం. ఈ పథకం ప్రారంభించినప్పటి నుండి బీమా పరిహారముగా మొత్తం 6,872 కోట్ల రూపాయలను ప్రత్యక్ష నగదు బదలీ విధానం ద్వారా 44.55 లక్షల మంది రైతులకు వారి వారి ఖాతాలకు జమచేయడమైనది. వీటిలో గత ప్రభుత్వ బకాయిలు కూడా ఉన్నాయి. 55 లక్షల హెక్టార్ల పై చిలుకు భూమికి సంబంధించి ప్రకటించిన విస్తీర్ణంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **డా॥ వై.ఎస్.ఆర్. ఉచిత పంటల బీమా పథకానికి** 1,600 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

22. **'వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ పంట రుణాలు'** పథకం క్రింద నిర్ధిష్ట సమయంలోపు రుణాలు చెల్లించే రైతులకు లక్ష రూపాయల వరకు వడ్డీ లేని పంట రుణాలను మా ప్రభుత్వం అందజేస్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరం నుండి, వడ్డీ రాయితీ పరిహారం మొత్తాన్ని బ్యాంకులకు విడుదల చేయకుండా నేరుగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్నాము. ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి, గత ప్రభుత్వ బకాయిలతో సహా 1,834 కోట్ల రూపాయలు 73.88 లక్షల మంది రైతుల ఖాతాలలో ప్రత్యక్ష నగదు బదలీ (డి.బి.టి.) విధానం ద్వారా జమ చేయడం జరిగింది. 33 లక్షల మంది రైతులకు లబ్ది చేకూర్చేందుకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ పంట రుణాల కోసం 500 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

23. **వ్యవసాయ మార్కెటింగ్ మరియు ధరల స్థిరీకరణ నిధి:** దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న వ్యాపారులతో మన రాష్ట్ర రైతులను అనుసంధానం చేసేందుకు మా ప్రభుత్వం డిజిటల్ మార్కెటింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన ఇ-ఫార్మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఇ-ప్లాట్‌ఫారమ్‌ను విజయవంతంగా ఉపయోగిస్తున్న రైతులు మరియు వ్యాపారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఉండడం అనేది డిజిటల్ మార్కెటింగ్ అయిన ఈ ఇ-ఫ్లాట్‌ఫామ్ యొక్క ఆవశ్యకతను తెలియజేస్తుంది. ఈ అప్లికేషన్ ద్వారా ఇప్పటివరకు 4,000 మందికి పైగా రైతులు మరియు 2,000 మందికి పైగా వ్యాపారులు ప్రయోజనాన్ని పొందారు. అదేవిధంగా మా ప్రభుత్వం 3,000 కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులు తమ పంటలను కనీస మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించకుండా కాపాడుతోంది.

24. **వ్యవసాయ యాంత్రీకరణ:** పెట్టుబడి మరియు నిర్వహణల ఆర్థిక భారం రైతులపై పడకుండా, చిన్న మరియు సన్నకారు రైతులకు అద్దెకు ఇచ్చు పద్ధతి (హైరింగ్ మోడ్) లో, వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడానికి మా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం గల ప్రతీ గ్రామంలోను 10,750 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సి.హెచ్.సి.) లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటోంది. హార్వెస్టర్ మరియు స్ట్రా బేలర్‌లు కలిగి ఉన్న సుమారు 6,525 గ్రామ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సి.హెచ్.సి.) లు మరియు

391 క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సి.హెచ్.సి.) లు వరి పండించే ప్రధాన ప్రాంతాలలో ఏర్పాటుచేయబడ్డాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ యాంత్రీకరణ కోసం 1,212 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**పశుసంవర్ధక, పాడి మరియు మత్స్య పరిశ్రమ అభివృద్ధి**

**'పాడి లేని ఇల్లు పేడలేని చేను ఉండదు' అని నానుడి.**
**గొడ్డు వచ్చిన వేళ, బిడ్డ వచ్చిన వేళ అని మన రైతులు**
**సంతానంతో సమాన స్థాయిని పశువులకు ఇస్తూ వుంటారు.**

25. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో పశువుల పెంపకం ఒక ముఖ్యమైన రంగం. ఇది 2021-22 ఆర్థిక సంవత్సరంలో జోడించిన స్థూల విలువలో 11.45 శాతం వాటాను కలిగి ఉంది. 2021-22 ఆర్థిక సం॥లో మన రాష్ట్రం, దేశంలో గుడ్ల ఉత్పత్తిలో 1వ స్థానంలోనూ, మాంసం ఉత్పత్తిలో 2వ స్థానంలోనూ మరియు పాల ఉత్పత్తిలో 5వ స్థానంలోను ఉంది. స్థాపించబడిన 10,778 రైతు భరోసా కేంద్రాలలో, 9,844 పశుసంవర్ధక సహాయకుల మంజూరుతో పాటు అవసరమైన మందులు, పరికరాలు, పశువుల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార సంబంధిత మరియు సాధారణ సేవలు కూడా ఈ కేంద్రాల వద్ద అందించబడుతున్నాయి.

26. రైతులకు పశువుల బీమాను అందించడానికి అభివృద్ధి చెందిన మరియు స్వదేశీ పశువులే కాకుండా ఈ కోవకు చెందని పశువులు కూడా ఈ పథకం క్రిందకు వచ్చేటట్లుగా మా ప్రభుత్వం **వై.ఎస్.ఆర్. పశు బీమా పథకాన్ని** ప్రారంభించింది.

27. **డా॥ వై.ఎస్.ఆర్. సంచార పశు ఆరోగ్య సేవ:** పశువుల సంరక్షణ కోసం రైతుల ఇంటి వద్దకే పశు సంబంధిత సేవలను అందించడానికి మా ప్రభుత్వం 340 అత్యవసర సంచార పశు వైద్యశాలలను ప్రారంభించింది. జంతు వ్యాధుల కచ్చితమైన నిర్ధారణకు మరియు జబ్బు పడిన జంతువుల సత్వర చికిత్స కోసం వినియోగించే రైతుల వనరులను ఆదా చేయడానికి డాక్టర్ వై.ఎస్.ఆర్. వ్యవసాయ ఉత్పత్తుల పరీక్షా కేంద్రాలతో అనుసంధానం అయ్యేటట్లుగా 154 నియోజకవర్గ స్థాయి జంతు వ్యాధుల నిర్ధారణా కేంద్రాలు మంజూరు చేయబడ్డాయి.

28. **వై.ఎస్.ఆర్. మత్స్యకార భరోసా పథకం** క్రింద, చేపల వేట నిషేధ కాలంలో ఇచ్చే ఆర్థిక సహాయాన్ని మా ప్రభుత్వం 4,000 రూపాయల నుండి 10,000 రూపాయల వరకు పెంచింది. చమురుపై సబ్సిడీని లీటరుకు సుమారు 6 రూపాయల నుండి 9 రూపాయలకు పెంచింది. అంతేగాక చనిపోయిన ప్రతీ మత్స్యకార కుటుంబానికి ఇచ్చే సత్వర సహాయాన్ని 5 లక్షల రూపాయల నుండి 10 లక్ష రూపాయలకు పెంచింది. 61,682 రొయ్యలు మరియు చేపల సాగు రైతులకు విద్యుత్ పన్నును యూనిట్ రేటుకు రూ. 6.89 పైసల నుండి రూ. 1.50 పైసలకు తగ్గించడం జరిగింది.

29. అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరించి 9 చేపలు పట్టే ఓడ రేవుల నిర్మాణాన్ని మా ప్రభుత్వం చేపట్టింది. మొదటి దశ క్రింద ఉప్పాడ, నిజాంపట్నం, మచిలీపట్నం మరియు జువ్వలదిన్నె ఓడ రేవులు నిర్మాణంలో ఉన్నాయి. బుడగట్లపాలెం, పూడిమడక, బియ్యపుతిప్ప, వోడరేవు మరియు కొత్తపట్నంలలో మిగిలిన 5 చేపలు పట్టే ఓడ రేవులు రెండవ దశలో చేపట్టనున్నాము. అలాగే, మంచినీలపేట, చింతపల్లి, భీమిలి మరియు రాజయ్యపేటలలో బెర్త్ మరియు పోస్ట్ హార్వెస్ట్ సౌకర్యాలతో కూడిన 4 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణం చేపట్టబడింది.

## ప్రజా పంపిణీ వ్యవస్థ

30. మన రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థలో 4,24,07,705 మంది లబ్దిదారులు ఉన్నారు. ఫిబ్రవరి 2021 నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పంపిణీ సంచార వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకుల చేరవేతను ప్రవేశపెట్టినప్పటి నుండి లబ్దిదారుల సంఖ్య 84 శాతం నుండి 94 శాతంకి పెరిగింది.

31. దరఖాస్తుచేసిన 21 రోజులలో కొత్త కార్డులను గ్రామ మరియు వార్డు సచివాలయాల ద్వారా జారీ చేయడంలో దేశంలోనే మన రాష్ట్రం తొలి రాష్ట్రంగా నిలిచింది. ఇప్పటివరకు 48,75,906 దరఖాస్తులు ఈ విధానం ద్వారా పరిష్కరింపబడ్డాయి.

32. మా ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ క్రింద సార్టెక్స్ విధానం ద్వారా సేకరించబడిన నాణ్యమైన బియ్యాన్ని జనవరి 2021 నుండి పంపిణీ చేయడం ప్రారంభించింది. రక్తహీనత,

సూక్ష్మ పోషక లోపాల సమస్యలను పరిష్కరించడానికి మరియు పోషకాహార లోపాల్ని తగ్గించడానికి ఇనుము, విటమిన్ బి-12 మరియు ఫోలిక్ యాసిడ్‌లతో సమృద్ధిగా ఉన్న బలవర్ధక బియ్యం పంపిణీని మొదటి సారిగా ఏప్రిల్, 2020 నుండి విజయనగరం జిల్లాలో మా ప్రభుత్వం ప్రారంభించింది. తరువాత ఈ పథకాన్ని జూన్ 2021 నుండి సమగ్ర శిశు అభివృద్ధి పథకం మరియు మధ్యాహ్నం భోజన పథకాలకు కూడా విస్తరింప చేసింది. 2022 ఏప్రిల్ నుండి ఎక్కువ ఆవశ్యకత కలిగిన ఏడు జిల్లాలకు పూర్తిగా ఈ పంపిణీని విస్తరించడం జరిగింది. 2023 ఏప్రిల్ నుండి అన్ని జిల్లాలకు విస్తరింపచేసే విధంగా ప్రణాళిక చేయబడింది.

33. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆహార మరియు పౌర సరఫరాల శాఖకు 3,725 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## బి. మానవ సామర్థ్య పెంపు మరియు సాధికారత

### శిశు సంక్షేమం మరియు మహిళా సాధికారత

లూయిస్ పాశ్చర్, ఒక ఫ్రెంచ్ రసాయన శాస్త్రవేత్త మరియు సూక్ష్మ జీవ శాస్త్రవేత్త కూడా. ఇతని పరిశోధనలు టీకాల ఆవిష్కరణకు పునాదులుగా ఉపయోగపడ్డాయి. వీరు ఒకసారి ఇలా అన్నారు.

**'నేను ఒక పిల్లవాడిని కదిలించినప్పుడు,**
**అతను నాలో రెండు భావాలను ప్రేరేపించాడు -**
**అతను ఎలా ఉన్నాడో దాని పట్ల సున్నితత్వం మరియు**
**అతను ఎలా మారవచ్చో దానిపట్ల గౌరవం.'**

34. మన రాష్ట్రంలో పిల్లలు, మహిళల శ్రేయస్సు మరియు వారి పోషకాహార అవసరాలు తీర్చడం కోసం 257 సమగ్ర శిశు అభివృద్ధి పథకాలకు సంబంధించిన (ఐ.సి.డి.ఎస్.) ప్రాజెక్ట్‌లు, 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 7,15,000 మంది గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మరియు 6 నెలల నుండి 72 నెలల మధ్య వయస్సు గల 25,76,000 మంది పిల్లలలో

రక్తహీనత మరియు పోషకాహార లోపం సమస్యను పరిష్కరించడానికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనుబంధ పోషకాహారం కోసం **వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ ప్లస్ మరియు వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ పథకాలను** ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పథకం క్రింద రోజూ ఒక పూట సంపూర్ణ భోజనంతో పాటు పోషకాహార కిట్, పాలు, గుడ్డు అందజేస్తున్నాము.

35. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు సమీపంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు వై.ఎస్.ఆర్. ప్రారంభ ప్రాథమిక పాఠశాలలుగా పనిచేస్తాయి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాలలలో ప్రిపరేటరీ తరగతి, 1వ తరగతి మరియు 2వ తరగతి ఉంటాయి. ఇవి విద్యకు పునాదివేసే పాఠశాలలుగా పిలువబడుతున్నాయి.

**ఆరోగ్య సంరక్షణ మరియు పోషకాహారం**

36. కోవిడ్ అనంతర ప్రపంచంలో, ఆరోగ్య సంరక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా మార్చాల్సిన అవసరం ఉంది. ఇది రాబోయే సంవత్సరాలలో ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుంది. ఈ విషయంలో, నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆరోగ్య సంరక్షణ సంస్థలను ప్రాథమిక స్థాయి నుండి అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ స్థాయికి మార్చడంతోపాటు సౌకర్యాల భౌతిక స్థాయిని పెంచడం మాత్రమే కాకుండా, అవసరమైన పరికరాలు మరియు శిక్షణ పొందిన మానవ వనరులను సమకూర్చడంలో కూడా ఎంతో ఉపయోగపడుతుంది.

37. జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద 108-సేవలను, 104-సేవలను మరియు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల వంటి ప్రాధాన్యతా కార్యక్రమాలను బలోపేతం చేయడంతో పాటు, ముఖ్యమైన పథకాల క్రింద తగిన కేటాయింపులు చేయబడ్డాయి. మా ప్రభుత్వం వ్యాధులు రాకుండా తీసుకునే ముందస్తు చర్యలలో భాగంగా మరియు ఆరోగ్య సంరక్షణ సేవలను పౌరుల ఇంటి వద్దకు **కుటుంబ వైద్యుల కార్యక్రమం** ద్వారా తీసుకు వెళుతోంది. అనారోగ్య సమయాలలో రోగులు ప్రయాణించాల్సిన అవసరం లేదని మరియు తదుపరి సంరక్షణపై మెరుగైన పర్యవేక్షణ ఉందని ఈ కార్యక్రమం నిర్ధారిస్తుంది. సాధారణ OP, అంటు వ్యాధులు

కాని వ్యాధుల నిర్వహణ, ప్రసవానికి ముందు మరియ తరువాత సంరక్షణకై మరియు మంచాన ఉన్న రోగులకు ఇంటి వద్దకు వైద్యులు సేవలు అందిస్తారు. ఈ వైద్యులు 104-MMU వాహనాల ద్వారా 15 రోజులకు ఒకసారి డాక్టర్ వై.ఎస్.ఆర్. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను (విలేజ్ హెల్త్ క్లినిక్‌లను) సందర్శిస్తారు. ఈ ఆరోగ్య కేంద్రాలలో రోగులకు 14 రకాల లేబొరేటరీ పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు, ఈ కార్యక్రమం కింద 54 లక్షల మందికి పైగా ప్రజలు తమ ఇంటి వద్ద వైద్య సేవలను పొందారు.

38. దాదాపు 1.41 కోట్ల కుటుంబాలను డాక్టర్ వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి తీసుకొచ్చింది. వ్యాధి గుర్తింపు, చికిత్స మరియు నివారణ విధానాలను 2,446 నుండి 3,255 కి మా ప్రభుత్వం పెంచింది. మన రాష్ట్రంలోనే కాకుండా హైదరాబాద్, చెన్నై మరియు బెంగళూరు నగరాలలో కూడా 716 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పొందే విధంగా ఈ పథకాన్ని విస్తరించడం జరిగింది. **డాక్టర్ వై.ఎస్.ఆర్. ఆరోగ్య ఆసరా** క్రింద శస్త్రచికిత్స తర్వాత జీవనోపాధి నిమిత్తం నెలకు 5,000 రూపాయలు అందించబడుతుంది.

**జగనన్న గోరుముద్ద**

***'ఆహార దోషము విజ్ఞాన నాశనమునకు మూలము' అని పెద్దలు చెప్పారు.***

39. పిల్లలకు రుచికరమైన, బలవర్ధకమైన మరియు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించే విధంగా, మా ప్రభుత్వం రోజువారీ వంటకాల జాబితా మెరుగుపరచటం ద్వారా జనవరి 2020 నుండి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పునరుద్ధరించింది. సిఫార్సు చేయబడిన రోజువారీ భత్యం (ఆర్.డి.ఎ.) కంటే కూడా ఎక్కువ పోషక విలువలతో కూడిన ఐదు గుడ్లు, మూడు వేరుశెనగ బెల్లం అచ్చులు మరియు 15 ఇతర రుచికరమైన ఆహార పదార్థాలు ప్రతీ వారం అందించబడుతున్నాయి. ఇవి సిఫార్సు చేయబడిన రోజువారీ భత్యం కంటే ఎక్కువ పోషక విలువలను కలిగి ఉంటాయి. మా ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన భోజనం అందించడానికి సంవత్సరానికి 1,000 కోట్ల రూపాయలను అదనంగా ఖర్చు చేస్తోంది.

40. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆరోగ్యం, వైద్యం మరియు కుటుంబ సంక్షేమం కోసం 15,882 కోట్ల రూపాయలు కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**మహిళా సాధికారత**

***మహిళలు స్ఫూర్తి ప్రదాతలు;***
***అనుభవాలను జీవిత పాఠాలుగా మలిచే మణిపూసలు;***
***ప్రకృతికి మరో రూపాలు;***
***మహిళలు మహిలో నడయాడే ఆది పరాశక్తులు.***

మా ప్రభుత్వ విధానంలో మహిళా సాధికారత ఒక ప్రధాన లక్షణం.

**జగనన్న పాల వెల్లువ**

41. మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా, మహిళా పాడి రైతులను ఏకీకృతం చేయడానికి అదేవిధంగా వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలతో సమానంగా మహిళా పాల సహకార సంఘాలను (ఎం.డి.ఎస్.ఎస్.) ప్రోత్సహించడానికి జగనన్న పాల వెల్లువ ప్రాజెక్ట్‌ను అమలులోనికి తీసుకువచ్చింది. 17 జిల్లాలలో సుమారు 2.5 లక్షల మంది మహిళా పాడి రైతుల కోసం **జగనన్న పాల వెల్లువ ప్రాజెక్టు**ను అమలు చేయడం జరిగింది. దళారులను తొలగించి పాడి రైతుల నుండి నేరుగా సుమారు 561 లక్షల లీటర్ల పాలను కొనుగోలు చేసి 250 కోట్ల రూపాయలను నేరుగా వారి వారి బ్యాంకు ఖాతాలకు చెల్లించడం జరిగింది. ఈ విధానం వలన పాడి రైతులకు పాల నాణ్యతను బట్టి గతంలో లభించే ధర కంటే లీటరుకు 5 రూపాయల నుంచి 20 రూపాయలు వరకు మెరుగైన ధర ఇప్పుడు లభిస్తోంది.

**వై.ఎస్.ఆర్. ఆసరా**

42. స్వయం సహాయక సంఘాలలోని గ్రామీణ మరియు పట్టణ పేద మహిళలకు ఏప్రిల్ 4, 2019 నాటికి బకాయి ఉన్న బ్యాంకు రుణాల మాఫీ కోసం మా ప్రభుత్వం **వై.ఎస్.ఆర్. ఆసరా పథకం** క్రింద 4 విడతలుగా చెల్లిస్తామని ప్రకటించడం జరిగింది. గ్రామీణ మరియు

పట్టణ ప్రాంతాలలోని 78.74 లక్షల స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు 3 విడతలుగా 19,137 కోట్ల రూపాయలను తిరిగి చెల్లించడం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **వై.ఎస్.ఆర్. ఆసరా పథకం** యొక్క 4వ విడత కోసం 6,700 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ**

43. సకాలంలో రుణాలను తిరిగి చెల్లించే సంస్కృతిని ప్రోత్సహించడానికి 3 లక్షల రూపాయల వరకు బ్యాంకు రుణాలను కలిగి ఉన్న అన్ని స్వయం సహాయక సంఘాలపై వడ్డీ భారాన్ని తగ్గించడానికి మా ప్రభుత్వం **వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ పథకాన్ని** అమలు చేస్తోంది. దీనికి గాను 2019 సంవత్సరం నుండి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలను కలుపుకొని స్వయం సహాయక సంఘాలకు చెందిన 1.02 కోట్ల మహిళలకు 3,615 కోట్ల రూపాయలు చెల్లించబడ్డాయి. ఈ చర్య మహిళా సాధికారత ప్రయత్నాలను బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాలకు చెందిన పేద మహిళల ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ పథకం** కోసం 1,000 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. చేయూత**

44. ప్రభుత్వం షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల మరియు అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల 25 లక్షల మంది మహిళలకు సంవత్సరానికి 18,750 రూపాయల చొప్పున గత నాలుగేళ్లలో 75,000 వేల రూపాయలను ఇవ్వడం జరిగింది. ఈ మొత్తాన్ని లబ్దిదారులు తమ ఎంపిక ప్రకారం ప్రస్తుత జీవనోపాధి కార్యకలాపాలలోను లేదా కొత్త సంస్థల స్థాపనకు పెట్టుబడిగా పెట్టుకోవడంలోను ఉపయోగిస్తున్నారు. ఇప్పటి వరకు 26.7 లక్షల మంది మహిళా సభ్యులకు 3 విడతలుగా 14,129 కోట్ల రూపాయలను అందజేయడం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **వై.ఎస్.ఆర్. చేయూత పథకం** కోసం 5,000 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

45.	మహిళలకు సహాయం అందించడం కోసం **'ఉజ్జావల'** మరియు **'స్వధార్ గృహ పథకం'** క్రింద నడిచే గృహాలు, వన్ స్టాప్ సెంటర్‌లు, మహిళా ఉద్యోగినిల వసతి గృహాలు, సేవా గృహములు, ఉచితంగా పనిచేసే మహిళా హెల్ప్‌లైన్ నెంబర్లు పనిచేస్తున్నాయి. సమీకృత మహిళా సాధికారత కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు **మిషన్ శక్తి పథకం** క్రింద రాష్ట్ర కమిటీని మా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది.

46.	2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **మహిళా అభివృద్ధి మరియు పిల్లల సంక్షేమం** కోసం 3,951 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**విద్య**

**'అభ్యాసం సృజనాత్మకతను ఇస్తుంది,**
**సృజనాత్మకత ఆలోచనకు దారి తీస్తుంది,**
**ఆలోచన జ్ఞానాన్ని అందిస్తుంది,**
**జ్ఞానం నిన్ను గొప్పవానిగా చేస్తుంది'**

**-ఎ.పి.జె. అబ్దుల్ కలాం**

***'వెలుగుతున్న దీపమే మరిన్ని దీపాలను వెలిగించగలదు;***
***నేర్చుకున్నవారే దాన్ని ఇతరులకు నేర్పించగలరు' అన్న వాస్తవాన్ని గుర్తించిన ప్రభుత్వం,***
***మా ప్రభుత్వం.***

47.	మన ప్రభుత్వం **మన బడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మ ఒడి,** పాఠ్యాంశ సంస్కరణలు, మరుగుదొడ్ల నిర్వహణ నిధి (టి.ఎమ్.ఎఫ్), పాఠశాల నిర్వహణ నిధి (ఎస్.ఎమ్.ఎఫ్) మరియు సమీకృత పాఠ్యాంశ, పరిపాలన సంస్కరణల వంటి కార్యక్రమాలను మరియు విధి-విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా పాఠశాల విద్యలో పరివర్తన యుగానికి నాంది పలికింది. ప్రభుత్వ పాఠశాలలలో విద్యను మెరుగుపరచి మన విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీపడేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం.

48. ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా నిర్దిష్టమైన తరగతి అభ్యాస ఫలితాలను నిర్ధారించడానికి గాను డిజిటల్ కంటెంట్‌ను ఉపయోగించి మిశ్రమ అభ్యాసాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించడం జరిగింది. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రత్యేక దృశ్య మాధ్యమ తరగతులు మరియు విద్యా పునాదిని వేసే ప్రాథమిక పాఠశాలలలో **స్మార్ట్ టీవీ గదులు** నిర్మించేందుకు ప్రభుత్వం తన ఆమోదం తెలిపింది. మా ప్రభుత్వం ఉపాధ్యాయులకు 60,000 ట్యాబ్‌లను, కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు (సి.బి.ఎస్.ఇ.) సూచించిన విధానంలో 2024-25 విద్యా సంవత్సరంలో10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రస్తుత 8వ తరగతి విద్యార్థులకు 4.6 లక్షల ట్యాబ్‌లను పంపిణీ చేసింది.

**జగనన్న అమ్మ ఒడి**

49. వినూత్నమైన, విశిష్టమైన **జగనన్న అమ్మ ఒడి** కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా పేదరికం విద్యకు అడ్డంకిగా మారకుండా హాజరు శాతం తగ్గకుండా మా ప్రభుత్వం చూస్తున్నది. ఈ పథకం క్రింద, 2019-20 ఆర్థిక సంవత్సరం నుండి 44 లక్షల 50 వేల మంది తల్లులకు మరియు 84 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఏటా సుమారు 19,618 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరుగుతూ ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **జగనన్న అమ్మ ఒడి పథకం** కోసం 6,500 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

50. అదేవిధంగా, **మన బడి నాడు-నేడు** కార్యక్రమం క్రింద, 15,715 పాఠశాలలలో అదనపు తరగతి గదులు, సురక్షిత త్రాగునీరు, పెద్ద మరియు చిన్నచిన్న మరమత్తు పనులు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుద్దీకరణ, పెయింటింగ్, ఫర్నిచర్, గ్రీన్ బోర్డులు, ఇంగ్లీష్ ల్యాబ్‌లు మరియు వంట శాలలు అనే 10 మౌలిక సదుపాయాలు ఆధునీకరించబడ్డాయి. ఈ కార్యక్రమము క్రింద మొదటి మరియు రెండవ దశలలో మొత్తము 22,344 పాఠశాలలలో పనులు చేపట్టబడ్డాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **మన బడి నాడు-నేడు కార్యక్రమం** కోసం 3,500 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**జగనన్న విద్యా కానుక**

51. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరచడానికి మరియు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, యూనిఫామ్‌లు, బూట్లు, సాక్స్‌లు, పాఠ్య పుస్తకములు, వర్క్ బుక్‌లు, స్కూల్ బెల్ట్ మరియు మాస్క్‌ల సెట్‌లతో కూడిన **'టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్'** ను విద్యార్థి కిట్‌ల రూపంలో ప్రభుత్వం అందిస్తూ ఉంది. ఈ పథకం క్రింద 47.4 లక్షల మంది పిల్లలకు లబ్ది చేకూర్చేందుకుగాను మా ప్రభుత్వం ఇప్పటివరకు 2,368 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **జగనన్న విద్యా కానుక పథకం** కోసం 560 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**జగనన్న విద్యా దీవెన మరియు జగనన్న వసతి దీవెన**

***విద్య మాత్రమే మానవాళికి జీవనాడి. విద్య వలన ఆత్మ విశ్వాసం మెరుగుపడుతుంది. ఇది మన సొంతమైతే మహోన్నత విజయాలకు దారితీస్తుంది అన్నారు.***

***-స్వామి వివేకానంద***

52. పాలిటెక్నిక్, ఐ.టి.ఐ., ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ మరియు ఉన్నత కోర్సులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించే **జగనన్న విద్యా దీవెన పథకాన్ని** మా ప్రభుత్వం అమలు చేస్తోంది. **జగనన్న వసతి దీవెన పథకం** క్రింద ఉన్నత విద్యలో స్థూల హాజరు నమోదు నిష్పత్తిని మెరుగుపరిచే లక్ష్యంతో విద్యార్థుల ఆహారం మరియు వసతి గృహాల ఖర్చులను భరిస్తుంది. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, కాపు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, దివ్యాంగుల వర్గాల విద్యార్థులందరికీ ఈ పథకాలను అమలు చేస్తున్నాము. 2019 సంవత్సరం నుండి మా ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం క్రింద 9,249 కోట్ల రూపాయలను రీయింబర్స్‌మెంట్ చేయడం జరిగింది. జగనన్న వసతి దీవెన పథకం క్రింద 3,366 కోట్ల రూపాయలను పంపిణీ చేయడం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **జగనన్న విద్యా దీవెన పథకం** నకు 2,841 కోట్ల రూపాయలను మరియు **జగనన్న వసతి దీవెన పథకం** నకు 2,200 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

53. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **పాఠశాల విద్య** కోసం 29,690 కోట్ల రూపాయల మరియు **ఉన్నత విద్య** కోసం 2,064 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## గ్రామీణాభివృద్ధి

**'భారత దేశ ఆత్మ గ్రామాలలో నివశిస్తుంది.'**

**-మహాత్మా గాంధీ**

54. మా ప్రభుత్వం సుస్థిరమైన జీవనోపాధిని కల్పించడానికి మరియు గ్రామీణ ప్రాంతాలలో శాశ్వతమైన ఆస్తులను సృష్టించడానికి 16 ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ **మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కల్పనా హామీ పథకం** (M.G.N.R.E.G.S.) ను అమలు చేస్తోంది. ఈ ఆస్తులలో 10,917 గ్రామ సచివాలయ భవనాలు, 10,243 వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసే నిర్మాణాలు, 8,320 భారత్ నిర్మాణ సేవా కేంద్రాలు, ఎక్కువ మోతాదులో పాల శీతలీకరణ చేసే 3,734 పాల శీతలీకరణ యూనిట్లు మరియు నీటి సంరక్షణా కట్టడాలు ఉన్నాయి. డిసెంబర్ 2022 నాటికి ఈ రంగంలో సుమారుగా 18.39 కోట్ల పని దినాలు కల్పించబడ్డాయి. అంతేగాక 98 శాతం చెల్లింపులు 15 రోజులలోపు చేయబడ్డాయి.

55. ఉచితంగా బోరు బావులు త్రవ్వి పంపుసెట్లను ఏర్పాటు చేస్తూ, తద్వారా సాగు యోగ్యమైన భూములకు నీటిపారుదల సౌకర్యాన్ని పెంచేవిధంగా గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు సన్న, చిన్నకారు రైతుల కోసం **వై.ఎస్.ఆర్. జలకళ** కార్యక్రమాన్ని సెప్టెంబర్ 28, 2020 న ప్రారంభించారు. ఇప్పటి వరకు 17,047 బోరు బావులు త్రవ్వడం జరిగింది.

56. మా ప్రభుత్వం కుళాయి కనెక్షన్ల ద్వారా సుమారు 65 లక్షల ఇళ్లకు సురక్షిత మంచినీటిని అందించింది. జగనన్న కొత్త హౌసింగ్ కాలనీలతో సహా 2024 సంవత్సరం నాటికి రాష్ట్రంలోని అన్ని కుటుంబాలు వీటి క్రిందకు తీసుకురాబడతాయి.

57. మా ప్రభుత్వం 250 మరియు అంతకంటే ఎక్కువ జనాభా ఉండి రహదారుల అనుసంధానం లేని అన్ని నివాసాలకు అనుసంధానించడానికి **'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారి**

**ప్రాజెక్టు'** ను అమలు చేస్తోంది. ఇప్పటివరకు 1,737 కి.మీ. రహదారుల పొడవుతో సుమారు 1,198 ఆవాసాలు ఈ ప్రాజెక్టు క్రింద అనుసంధానం చేయబడ్డాయి. 2023-24 ఆర్థిక సం॥లో 3,692 కి.మీ. రహదారి పొడవుతో అదనంగా 2,461 ఆవాసాలను కలుపుటకు ఈ ప్రాజెక్టు క్రింద ప్రణాళిక చేయబడింది. ప్రయోజనకరమైన ఈ రహదారుల అనుసంధానం వలన మార్కెట్ మెరుగుపడి రోజువారీ వేతనాల పెరుగుదలకు దారితీసింది.

58. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధికి** 15,873 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పట్టణ అభివృద్ధి**

59. 11వ సుస్థిర అభివృద్ధి లక్ష్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం సుస్థిర నగరాలు మరియు సమాజాల అభివృద్ధి. చక్కగా నిర్వహించబడుతున్న పట్టణ అభివృద్ధి మరియు పౌర కేంద్రీకృత సేవలను అందించడం యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తూ, **వార్డు సచివాలయం మరియు వార్డు వాలంటీర్ వ్యవస్థల** ద్వారా 123 పట్టణ స్థానిక సంస్థలన్నింటిలోను పట్టణ స్థాయి సేవలు అన్నీ జవాబుదారీగా, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా అందించడానికి మా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది.

60. మంగళగిరి, తాడేపల్లి పురపాలక ప్రాంతాలలో మౌలిక వసతులు, సేవలను మెరుగుపరిచి నమూనా పట్టణాలుగా ఉండేటట్లుగా మా ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ ఉన్నది. అదే సమయంలో, ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థలలో పురపాలక పాఠశాలల పరివర్తన పథకాన్ని అమలు చేస్తోంది. పురపాలక ప్రాంతాలలో ఉన్న ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం మరియు వ్యర్థాలను పారవేయడం, పరిసరాల గాలి నాణ్యత మరియు త్రాగు నీటిని మెరుగుపరచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తగిన శ్రద్ధ తీసుకుంటోంది.

61. ఇటీవల జరిగిన ప్రపంచ పెట్టుబడుదారుల సదస్సు తర్వాత, విశాఖపట్నంలో మార్చి 28 మరియు 29 తేదీలలో ఫైనాన్స్ ట్రాక్ క్రింద జి-20 మౌలిక వసతులను ఏర్పాటు చేసే వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని నిర్వహించేందుకు మా ప్రభుత్వం సిద్ధమవుతోంది. రోడ్లు వేయడం,

ఫుట్‌పాత్‌ల పునరుద్ధరణ, కొత్త బీచ్ స్ట్రెచ్‌ల అభివృద్ధి మరియు బీచ్‌లను పరిశుభ్రం చేయడం ద్వారా విశాఖపట్నంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచబడ్డాయి. మౌలిక వసతులను ఒక ఆస్తి విలువగా అభివృద్ధి చేయడం, నాణ్యమైన మౌలిక సదుపాయల మదుపును ప్రోత్సహించడం, ఇన్‌ఫ్రా–టెక్, మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం మదుపు కొరకు ఆర్థిక వనరులను సమీకరించే వినూత్న సాధనాలను గుర్తించడం వంటి వివిధ అంశాలలో నిమగ్నమవ్వడానికి జి–20 సమావేశం మాకు మరో అవకాశాన్ని అందిస్తుంది.

62. 2023–24 ఆర్థిక సంవత్సరానికి **పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధికి** 9,381 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**నైపుణ్య అభివృద్ధి మరియు శిక్షణ**

***మనం పనిచేస్తున్న విధానానికి;***
***అదే పనిని చేయగల సామర్థ్యానికి గల తేడాను అధిగమించగలిగితే,***
***ప్రపంచంలో ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరించగలము.***

***–మహాత్మా గాంధీ***

63. నేటి పోటీ ప్రపంచంలో యువత అభివృద్ధి చెందాలంటే సరైన నైపుణ్యాలు మరియు సామర్థ్యాలు ఎంతో అవసరం. గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా రాష్ట్రానికి **క్యాస్కేడింగ్ స్కిల్ ఎకోసిస్టమ్ మోడల్**ను రూపొందించారు. ఈ వ్యవస్థలో రాష్ట్ర స్థాయిలో నైపుణ్య విశ్వవిద్యాలయం, జిల్లా స్థాయిలో నైపుణ్య కళాశాలలు మరియు నియోజక వర్గ స్థాయిలో నైపుణ్య కేంద్రాలు ఉంటాయి. ఇవి అభ్యర్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు మరియు ప్రత్యేకతలను అందించడంలో భాగస్వాములుగా ఉంటూ, పాఠ్యాంశాలను రూపొందించడం, నిర్వహించడం మరియు ఉద్యోగ అవకాశాలను అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు 21 జిల్లాలలో 21 నైపుణ్య కళాశాలలు, 175 అసెంబ్లీ నియోజిక వర్గాలలో 192 నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి.

ఆరోగ్య సంరక్షణ, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, ఔషధ తదితర రంగాలలో 50,000 కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు నైపుణ్యాన్ని కల్పించడం కోసం ఏటా ప్రణాళికలు రూపొందిండం జరిగింది.

64. పారిశ్రామిక విలువల పెంపుదల కోసం నైపుణ్యాలను బలోపేతం చేసే కార్యక్రమం (STRIVE) క్రింద పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐ.టి.ఐ.) లలో నైపుణ్యాభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలను కూడా మా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అల్ప సంఖ్యాక వర్గాల వారి కోసం రెండు కొత్త పారిశ్రామిక శిక్షణా సంస్థలను ఆదోని మరియు రాయచోటిలలో స్థాపించబోతున్నాము. 18 రకాల నైపుణ్యాలలో ద్వంద్వ శిక్షణా విధానాన్ని నిర్వహించుకోవడానికి 81 పారిశ్రామిక శిక్షణా సంస్థలు మరియు 154 మంది విభిన్న రంగాలకు చెందిన పారిశ్రామిక భాగస్వాముల మధ్య అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాల వలన విద్యార్థులు తమ శిక్షణా కాలవ్యవధిలో సగం కాలాన్ని పరిశ్రమలలో ఉద్యోగ శిక్షణ పొందేందుకు వెచ్చించడం వలన విద్యార్థులు తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోగలుగుతారు.

65. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **నైపుణ్యాభివృద్ధికి** 1,166 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**యువజన అభివృద్ధి, పర్యాటకం మరియు సంస్కృతి**

**'ఒక దేశం యొక్క యువత తమ భావితరాలకు నిర్ణేతలు.'**

**- బెంజమిన్ డిస్రెలీ**

66. మా ప్రభుత్వం చక్కని క్రీడా సౌకర్యాలను కల్పించడం ద్వారా మన రాష్ట్ర యువతను దేశంలోనే అత్యంత ఆరోగ్యకరంగా, సంతోషకరంగా మరియు పరిపూర్ణంగా అభివృద్ధి చెందిన వ్యక్తులుగా రూపొందించాలని భావిస్తోంది. ప్రభుత్వం 39 క్రీడా వికాస కేంద్రాలకు సంబంధించిన పనులను పూర్తి చేయగా 67 కేంద్రాలకు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయని గౌరవ సభకు తెలియజేసుకుంటున్నాను.

67. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు క్రీడల కోటా క్రింద, రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్య, దంత వైద్య విద్య, ఇంజనీరింగ్ మొదలైన వృత్తిపరమైన కోర్సుల ప్రవేశాలలోను, ఇంకా రాష్ట్ర ప్రభుత్వ మరియు ప్రభుత్వ రంగ సంస్థలలోని నియామకాలలోను మా ప్రభుత్వం రిజర్వేషన్‌ను అమలు చేస్తోంది.

68. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకమైన అభివృద్ధి చోదక శక్తి అయిన పర్యాటక రంగాన్ని మా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలలో మౌలిక సదుపాయాలైన థీమ్ పార్కులు, వినోద ఉద్యానవనాలు, పర్యాటక సౌకర్యాలు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో వసతి సదుపాయాలు, హోటళ్లు మొదలైన వాటిని అభివృద్ధి చేయడం ద్వారా మన రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా మార్చడం ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2020-2025 యొక్క లక్ష్యం. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం చేసే ప్రయత్నాలకు ఇటీవల మన రాష్ట్రంలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు లభించిన విశేష స్పందనే నిదర్శనం. మన రాష్ట్ర పర్యాటక రంగంలో సుమారు 22,000 కోట్ల రూపాయల పెట్టుబడితో 181 అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

69. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్మృతి చిహ్నంగా స్మృతి వనాన్ని నిర్మిస్తోంది. ఇందులో ప్రతిష్టాత్మకంగా 125 అడుగుల అంబేద్కర్ గారి కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టింది. ఈ స్మృతి వనంలో 2 వేల మంది కూర్చోగల ఒక ఆడిటోరియం, 500 మంది కూర్చోగల ఒక ఓపెన్ థియేటర్ మరియు ఒక ధ్యాన మందిరం కూడా ఉంటాయి.

70. మన రాష్ట్రం యొక్క గొప్ప వారసత్వం మరియు సంస్కృతిపై అవగాహన కల్పించడం మరియు ప్రచారం చేయడం మా ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రయత్నంలో, రాష్ట్రంలోని మ్యూజియం సందర్శకులకు సుసంపన్నమైన అనుభవాన్ని అందించడానికి అధునాతన డిజిటల్ ఇంటరాక్టివ్ డిస్‌ప్లే టెక్నాలజీలు, వర్చువల్ రియాలిటీ, ప్రేక్షకులను ప్రత్యక్షంగా లీనంచేసే ప్రదర్శనల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విజయవాడలోని బాపు మ్యూజియంలోను మరియు

కొండపల్లి కోటలోను అమలు చేయడం జరిగింది. ఈ అధునాతన డిజిటల్ టెక్నాలజీలను ఏలూరు మరియు అనంతపురం మ్యూజియంలలో కూడా ఇప్పుడు అమలు చేయనున్నాము.

71. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **యువజన అభివృద్ధి, పర్యాటకం మరియు సంస్కృతి** శాఖ కోసం 291 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

## సి. సామాజిక భద్రత

*'న్యాయమైన సమాజం అంటే, దానిపట్ల గౌరవం పెరగటం మరియు ధిక్కార భావం తగ్గటం. ఇది కరుణ గల సమాజ నిర్మాణంలో మాత్రమే సాధ్యం.'*

***- డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్***

72. సాంఘిక సంక్షేమంలో ప్రభుత్వ చొరవ అనేది జీవనోపాధిని రక్షిస్తూ మరియు సామాజిక-ఆర్థిక అభ్యున్నతికి సహాయాన్ని అందిస్తూ ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో సామాజిక భద్రత మరియు సంక్షేమంపై పెట్టిన ప్రభుత్వం యొక్క మొత్తం వ్యయం శాతం 4.7 మాత్రమే. ఇది 2021-22 ఆర్థిక సంవత్సరం నాటికి గణనీయంగా పెరిగి 13 శాతంగా ఉందని గౌరవ సభకు తెలియజేసుకుంటున్నాను. మా ప్రభుత్వం సామాజిక భద్రతా విధానాల ప్రయోజనకరమైన ప్రభావాన్ని పరిశీలిస్తే, మా ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో కూడా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన లబ్దిదారులకు అందజేసే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని గౌరవ సభకు తెలియజేసుకుంటున్నాను. ఈ సంక్షేమ పథకాలన్నింటినీ ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్నాము.

73. రాష్ట్రంలోని షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల, అల్పసంఖ్యాక వర్గాల, కాపు మరియు ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన వారి పరిపూర్ణ అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి మా ప్రభుత్వం వెనుకబడిన తరగతి వర్గాలకు 56 కార్పోరేషన్లు, షెడ్యూలు కులాలకు చెందిన

వారికి 3 కార్పోరేషన్లు మరియు షెడ్యూలు తెగలకు చెందిన వారికి 1 కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసింది.

74. **అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం**

అల్పసంఖ్యాక వర్గాల అవసరాలను తీర్చడానికి తగిన కేటాయింపులు జరిగేలా మా ప్రభుత్వం మైనార్టీ కాంపోనెంట్‌ను అమలు చేస్తుంది. మా ప్రభుత్వం నెలకు, **మౌజన్‌లకు** 5,000 రూపాయలు, **ఇమామ్‌లకు** 10,000 రూపాయలు, **పాస్టర్లకు** 5,000 రూపాయలను గౌరవ వేతనంగా చెల్లిస్తుంది. ఈ వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు వివాహ ఖర్చుల కోసం ప్రభుత్వం **వై.ఎస్.ఆర్. షాదీ తోఫాను** అమలు చేస్తోంది. హజ్ యాత్రికులు మరియు జెరూసలేం యాత్రికుల ప్రయాణ ఖర్చులకు మా ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా అందిస్తోంది.

**వై.ఎస్.ఆర్. పెన్షన్ కానుక**

75. ప్రమాణ స్వీకారం చేసిన నాడే గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు చేసిన మొదటి నిర్ణయం ద్వారా అంతకుముందు సుమారు 5 సంవత్సరాలపాటు 1,000 రూపాయలగా ఉన్న పింఛను మొత్తాన్ని 2,250 రూపాయలకు పెంచడం ద్వారా పింఛనుదారులు గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేటట్లు చేయడం. మేనిఫెస్టోలో చెప్పిన హామీకి అనుగుణంగా, రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలోని 64.45 లక్షల మంది పింఛనుదారులకు జనవరి 1, 2023 నుండి ప్రభుత్వం వై.ఎస్.ఆర్. పెన్షన్ కానుకను నెలకు 2,750 రూపాయలకు పెంచింది. మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా మున్ముందు ఈ పింఛన్‌ను 3,000 రూపాయలకు పెంచడానికి మేము కట్టుబడి ఉన్నాము. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **వై.ఎస్.ఆర్. పెన్షన్ కానుక** కోసం 21,434 కోట్ల రూపాయలు కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. కాపు నేస్తం**

76. మా ప్రభుత్వం ఇప్పటివరకు కాపు, బలిజ, తెలగ మరియు ఒంటరి వర్గాలకు చెందిన 45 నుండి 60 సం॥ల మధ్య వయస్సు గల మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం **వై.ఎస్.ఆర్. కాపు నేస్తం పథకం** క్రింద ఇప్పటి వరకు 1,997 కోట్ల రూపాయల సహాయం అందించింది.

2023-24 ఆర్థిక సంవత్సరంలో కూడా అర్హులైన మహిళా లబ్దిదారులకు ఒక్కొక్కరికి 15,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించబడుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో **వై.ఎస్.ఆర్. కాపు నేస్తం** కోసం 550 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. బీమా**

77. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే వ్యక్తికి సహజ లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు బీమా రక్షణను అందించడానికి గౌరవనీయ ముఖ్యమంత్రి గారు జూలై 1, 2021 న **వై.ఎస్.ఆర్. బీమా పథకాన్ని** ప్రారంభించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన 1.21 కోట్ల మంది ఈ పథకం క్రింద నమోదు చేసుకున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో **వై.ఎస్.ఆర్. బీమా** కోసం 372 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. ఈ.బి.సి. నేస్తం**

78. ఆర్థికంగా వెనుకబడిన కులాలకు చెందిన మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారి స్వయం ఉపాధికి మార్గాలు కల్పించడం కోసం, మా ప్రభుత్వం 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు సంవత్సరానికి 15,000 రూపాయలు అందచేస్తున్నాము. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **వై.ఎస్.ఆర్. ఈ.బి.సి. నేస్తం** కోసం 610 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. నేతన్న నేస్తం**

79. **చేనేత వృత్తి** ప్రపంచంలోని పురాతనమైన వృత్తులలో ఒకటి. మన రాష్ట్రంలోని నేత సంఘాలు శతాబ్దాలుగా తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ప్రతికూల పరిస్థితులలో కూడా కొనసాగుతున్నాయి. ఇక్కడి పొందూరు ఖద్దరు, ఉప్పాడ, ధర్మవరం పట్టు, మంగళగిరి కాటన్ మరియు శ్రీకాళహస్తి కలంకారీ నమూనాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. దీనిని గుర్తిస్తూ మా ప్రభుత్వం ప్రతీ నేత కుటుంబానికి సంవత్సరానికి 24,000 రూపాయల ఆర్థిక

సహాయం అందజేస్తూ తద్వారా వారి జీవనోపాధికి భరోసాను కల్పిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **వై.ఎస్.ఆర్. నేతన్న నేస్తం** కోసం 200 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**జగనన్న తోడు**

80. ఈ పథకం క్రింద చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, సాంప్రదాయ హస్తకళాకారులు తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీకి సంవత్సరానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించటం జరుగుతుంది. ఈ పథకం క్రింద 15.31 లక్షల లబ్ధిదారులకు ప్రయోజనాన్ని చేకూర్చడం గర్వించదగ్గ విషయం. ఈ పథకం క్రింద పంపిణీ చేసిన రుణం మొత్తం సుమారు 2,470 కోట్ల రూపాయలు. **జగనన్న తోడు పథకం** క్రింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి 35 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**జగనన్న చేదోడు**

81. రజకులు, నాయీ బ్రాహ్మణులు మరియు దర్జీలు సమాజానికి అపారమైన మరియు తిరుగులేని సేవలను అందిస్తున్నారు. అవ్యవస్థీకరమైన అధిక వడ్డీ ఋణాలపై వారు ఆధారపడటాన్ని తగ్గించడం మరియు స్వయం ఉపాధి కొనసాగించడం కోసం ఏడాదికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మా ప్రభుత్వం అందజేస్తోంది. **జగనన్న చేదోడు పథకం** క్రింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి 350 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. వాహనమిత్ర**

82. సొంత వాహనాన్ని కలిగి ఉన్న టాక్సీ, క్యాబ్ మరియు ఆటో డ్రైవర్‌ల సేవలను అభినందిస్తూ వారి వృత్తిలోని సవాళ్ళను ఎదుర్కొనేందుకు సంవత్సరానికి 10 వేల రూపాయల సహాయంను అందజేస్తుంది. ఈ సహాయం వారి వాహన బీమా, మరమ్మతులు మరియు ఇతర నిర్వహణ ఛార్జీల కోసం ఉపయోగపడుతుందని భావించడమైనది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **వై.ఎస్.ఆర్. వాహనమిత్ర పథకం** క్రింద 275 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**వై.ఎస్.ఆర్. లా నేస్తం**

83. క్రొత్తగా పట్టభద్రులైన న్యాయవాదులకు వారి వృత్తి యొక్క ప్రారంభ కాలంలో ఆర్థిక మద్దతు క్రింద జూనియర్ న్యాయవాదులకు నెలకు 5 వేల రూపాయల ఉపకార వేతనాన్ని అందజేస్తున్నాము. **వై.ఎస్.ఆర్. లా నేస్తం** కోసం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 17 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల కాంపోనెంట్**

84. 2023-24 ఆర్థిక సంవత్సరానికి షెడ్యూలు కులాల కాంపోనెంట్ కోసం 20,005 కోట్ల రూపాయలు, షెడ్యూలు తెగల కాంపోనెంట్ కోసం 6,929 కోట్ల రూపాయలు, వెనుకబడిన తరగతుల కాంపోనెంట్ కోసం 38,605 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**కాపు సామాజిక వర్గం మరియు అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం**

85. కాపు సామాజిక వర్గానికి వివిధ సంక్షేమ కార్యక్రమాల క్రింద ప్రతి సంవత్సరం ప్రత్యేక కేటాయింపులు చేస్తామని మా ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి **కాపు సంక్షేమానికి** 4,887 కోట్ల రూపాయలు మరియు **అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి** 4,203 కోట్ల రూపాయల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**డి. మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక అభివృద్ధి**

**గృహ నిర్మాణం**

86. **పేదలందరికీ ఇళ్లు** కార్యక్రమం క్రింద 2023 సంవత్సరం చివరి నాటికి 30.2 లక్షల శాశ్వత గృహాలను అర్హులైన లబ్దిదారులందరికీ అందించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. 18.63 లక్షల ఇండ్లకు గాను, మొదటి దశలో 16.91 లక్షల ఇండ్ల నిర్మాణం ప్రారంభంకాగా, వీటిలో 4.4 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తి అయ్యింది. మిగిలిన ఇండ్ల నిర్మాణం వివిధ దశలలో ఉంది.

87. మా ప్రభుత్వం వై.ఎస్.ఆర్. జగనన్న కాలనీలను నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు మరియు మురుగు కాల్వల ఏర్పాటు వంటి అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తోంది. లబ్దిదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం **రివర్స్ టెండరింగ్ ప్రక్రియ** మరియు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదికల** ద్వారా టెండర్లను ఖరారు చేసిన మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక, 5 మెట్రిక్ టన్నుల సిమెంట్, స్టీల్ మరియు 12 ఇతర నాణ్యమైన భవన నిర్మాణ సామగ్రిని ఉచితంగా అందిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను **పేదలందరికీ ఇళ్లు** కార్యక్రమం క్రింద 5,600 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పరిశ్రమలు మరియు మౌలిక సదుపాయాలు**

88. పరిశ్రమలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపడమే కాక, వివిధ రంగాలలో ఉత్పాదక సామర్థ్యాలను వెలికితీస్తూ ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తుంది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు, అద్భుతమైన స్పందన వచ్చి, ఆకర్షణీయమైన ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మన రాష్ట్రం యొక్క పటిష్ఠతను ఈ సదస్సు నిరూపించింది. 8,000 మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్.టి.పి.సి. రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, భారత్ బయోటెక్, జి.ఎం.ఆర్. గ్రూప్, దాల్మియా గ్రూప్, రెన్యూ పవర్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, సెంచురీ ప్లైబోర్డ్స్, శ్రీ సిమెంట్, రామ్‌కో సిమెంట్స్, అపోలో హాస్పిటల్స్, మరియు అనేక ఇతర ప్రముఖ పారిశ్రామిక సంస్థలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ప్రతిపాదించాయి.

